# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 264
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
జూలై 23, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు

- పార్లమెంట్ లో వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానం



8లో..

## ఉచిత బస్ ప్రయాణంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆలయాలకు పెరిగిన ఆదాయం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



2లో..

## ముందస్తు చర్యలు చేపట్టాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు, మహబూబాబాద్ కలెక్టర్లు, ఎస్పీలకు సూచన




2లో..

## రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ స్నేహ శబరీష్



## ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం వరంగల్ పట్టణంలోని దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి హాజరు పట్టికలు, రిజిష్టర్‌లు, తరగతి గదులను పరిశీలించారు.

–వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు2లో..

# గుంతల రోడ్డు.. బాగుపడేదెప్పుడో?

## ములుగు రోడ్డులో ముప్పు తిప్పలు

- స్మార్ట్ సిటీగా మారినా వెంటాడుతున్న సమస్యలు
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న జంక్షన్
- వాహనదారుల నడ్డి విరుస్తున్న గుంతలు
- అందం చూడవయ్యా అంటున్న ప్రతిపక్షాలు





వరంగల్ మహా నగరం స్మార్ట్ సిటీగా మారితే నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అందరూ కలలుగన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రేటర్ వరంగల్ రూపురేఖలే మారుతాయనుకున్నారు. వందల కోట్ల రూపాయల నిధులు కార్పొరేషన్ ఖజానాకు జమ కావడంతో ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని భావించారు. నగరంలో ఎక్కడ చూసినా స్మార్ట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఆవిష్కృతమవుతాయనుకున్నారు. కాని అధికారుల నిర్లక్ష్యం, పాలకుల కక్కుర్తితో నగరంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. పర్సంటేజీలకోసం అక్కరలేని పనులకు కోట్లు ఖర్చుచేసి అందినకాడికి దండుకున్నారు. స్మార్ట్ సీటీ పేరుతో పాలకులు, కాంట్రాక్టర్లు ఎంత దోచుకున్నారో చెప్పేందుకు నగరంలోని ములుగు రోడ్డు జంక్షన్ ఒక్కటి చాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చినుకు పడితే చిత్తడిగా మారుతూ ఈ ప్రాంతాన్ని చూసి నగర ప్రజలు చీత్కరించుకుంటున్నారు. ఓ మోస్తరు వర్షం పడిందంటే చాలు ములుగు రోడ్డు జంక్షన్ ప్రాంతంలో ప్రయాణం నరకంగా మారుతోంది. ఈ జంక్షన్ లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ గుంతల రోడ్డు.. బాగుపడేదెప్పుడో అంటూ తిట్టుకుంటున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

# గుంతల రోడ్డు.. బాగుపడేదెప్పుడో..?



- ములుగు రోడ్డులో ముప్పు తిప్పలు
- స్మార్ట్ సిటీగా మారినా వెంటాడుతున్న సమస్యలు
- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న జంక్షన్
- వాహనదారుల నడ్డి విరుస్తున్న గుంతలు
- అందం చూడవయా అంటున్న ప్రతిపక్షాలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** 1934 మున్సిపాలిటీగా అవతరించిన వరంగల్ ను 1960లో ప్రత్యేక తరగతి మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేశారు. ఆ తర్వాత 1994 ఆగస్టు 18న నగర పాలక సంస్థగా ప్రభుత్వం ప్రకటించింది. 2015 జనవరిలో నగరానికి చుట్టు పక్కల ఉన్న 42 గ్రామపంచాయతీలను విలీనం చేసి 'గ్రేటర్' స్థానం కల్పించారు. అప్పటినుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గా మారింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరం ముఖచిత్రం కూడా మారుతూ వచ్చింది.

## స్మార్ట్ కాదు స్లమ్ సిటీ..

వరంగల్ నగరం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు ఎంపికైనా సమస్యలు మాత్రం తీరలేదు. మురుగు నీటి కాల్వల నిర్మాణంలో సమగ్ర ప్లాన్ లేకుండానే ఇష్టాను సారంగా ఎక్కడికక్కడ రోడ్లు, డ్రైన్లు నిర్మించడంతో ఒకదానికి ఒకటి లింకు లేక ఎక్కడి మురుగు అక్కడే రోడ్డుపైకి ఉబికి వస్తోంది. దీంతో చినుకు పడిందంటే చాలు మురుగు కాలువలు ఉప్పొంగి రహదారులను ముంచెత్తుతున్నాయి. దీంతో స్మార్ట్ సిటీ కాస్త స్లమ్ సిటీగా మారుతోంది.

## చినుకు పడితే చిత్తడే..

నగరంలోని ములుగు రోడ్డు జంక్షన్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చినుకు పడిందంటే చాలు చిత్తడిగా మారుతోంది. మురుగు కాలువల్లో ప్రవహించాల్సిన నీరు రోడ్డుపైకి చేరి జంక్షన్ ప్రాంతాన్ని ముంచెత్తుతోంది. దీంతో చిన్న పాటి వర్షానికి కూడా ఈ ప్రాంతంలో రోడ్డునైనే రెండు, మూడు ఫీట్ల ఎత్తులో నీరు నిలిచి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. వరంగల్, హనుమకొండ ప్రాంతాలను కలుపు ముఖ్య జంక్షన్ కావడంతో నిత్యం ఈ ప్రాంతంలో ప్రయాణించే వారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. వరంగల్ లో నివసించేవారు ఎక్కువగా హనుమకొండలోని వివిధ దుకాణాలు, ఇతర ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసేవారంతా తెల్లారింది మొదలు హనుమకొండకు వచ్చి రాత్రి వెళల్లో తిరిగి వరంగల్ కు ప్రయాణమవుతుంటారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా హనుమకొండలోనే ఉండడంతో వరంగల్ ప్రాంత వాసులు హనుమకొండకు రాకుంటే పూట గడవని పరిస్థితి నెలకొంది. అయితే చినుకు పడిందంటే చాలు ప్రయాణం నరకంగా మారుతోంది.

## సర్కస్ చేయాల్సిందే..

ములుగు రోడ్డు జంక్షన్ లో మురుగు నీరు నిలిచి రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం పడిన సమంలో ఈ గుంతల్లో నీరు నిలిచి అది ఎంత లోతు ఉందో తెలియక అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహన దారులకు రోడ్డుపై సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. ఏదైనా ప్రమాదాలు జరిగినపుడు స్పందిస్తున్న బల్దియా అధికారులు ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రయానం నరకంగా మారింది. ఇప్పటికైనా గ్రేటర్ అధికారులు, పాలకవర్గం తగిన చర్యలు తీసుకొని ములుగు రోడ్డు జంక్షన్ లో పేరుకుపోయిన కష్టాలను తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.







# ముందస్తు చర్యలు చేపట్టాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు, మహబూబాబాద్ కలెక్టర్లు, ఎస్పీలకు సూచన

**వరంగల్ వాయిస్, ములుగు :** భారీ వర్షాల నేపథ్యంలో ములుగు, మహబూబాబాద్ జిల్లాల ప్రజలను కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తం చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ములుగు జిల్లాలోని పసర తాడ్వాయి మధ్యలో ఉన్న జలగలంచ, గుండ్ల వాగు వరుద ఉధృతిని అమె బుధవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిన్నటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అదే విధంగా ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ములుగు కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు ముఖ్యంగా విద్యుత్తు షాక్ ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. అదే విధంగా గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, కింది స్థాయి అధికారులతో మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# 27న పోచమ్మ తల్లి బోనాలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రావణ మాసంలో పోచమ్మ తల్లికి తొలి బోనం ఈ నెల 27న కుమ్మరులచే సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని పోచమ్మ కనకదుర్గమ్మ దేవాలయ కుమ్మర భక్తమండలి అధ్యక్షులు ఆకారపు మోహన్ తెలిపారు. పోచం మైదానంలోని పోచమ్మ, కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రావణ మాసంలో కుమ్మరి కులస్తులు మొట్టమొదటి బోనంతో పోచమ్మ తల్లికి బోనాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు లోక రక్షకురాలైన పోచమ్మ తల్లి బోనాలు మట్టేవాడ, కొత్తవాడ కుమ్మరులచే ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. భక్తులు కుమ్మరి కుండలో బోనాలు చేసి సమర్పించాలన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు హనుమకొండలోని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు స్నేహ శబరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు కలెక్టర్ కు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ముందుగా రెడ్ క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాప్, టైలరింగ్ శిక్షణ కేంద్రంతోపాటు తలసీమియా సెంటర్ ను సందర్శించి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. తలసీమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. పిదప రెడ్ క్రాస్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా 30 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవి.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, డాక్టర్ ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి, హనుమకొండ డీఎంహెచ్ఓ ఎ.అప్పయ్య, జిల్లా టీబీ (క్షయ) నిర్వహణాధికారి కె.హిమబిందు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాల తనిఖీ..

హసన్ పర్తి మండలం చింతగట్టు క్యాంపు సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీకి సంబంధించిన పలు రికార్డులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యాలయానికి నిత్యావసర సరకుల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులను తాజాగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి, పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు అన్నారు. సుబేదారిలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్ పరిధిలోని అల్లీ తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గరిగే యాకలక్ష్మి, గడ్డం లక్ష్మి, కొండోజు శ్రీలతలకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించిన ఆయన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు విడతల వారీగా రూ. 5 లక్షలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని నాగరాజు హామీ ఇచ్చారు. నిర్మాణాలకు ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని కూడా ప్రకటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను తిరిగి అందించడం జరుగుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోఇందిరమ్మ కమిటీ సభ్యులు కైత రాజు, మాజీ సర్పంచ్ సింగారపు మొగిలి, యూత్ నాయకులు సింగారపు అచ్యుత్, సురేష్ రాజు తో పాటు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన డ్యాక సాంబయ్య ఇటీవల మరణించగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, ఆత్మకూరు మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి రాజేందర్ రావు, సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి, పరకాల మండల కోశాధికారి ఏ.లింగయ్య, గ్రామ మాజీ సర్పంచ్ దేవేందర్ రావు, ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి భయ్యా పైడి, ఆత్మకూర్ మండల ఉపాధ్యక్షులు పూజారి రవి, పీసాల సాంబయ్య, బూత్ అధ్యక్షులు ఏ. శ్రీను, నాయకులు సంజీవరావు, వెంకటేశ్వర్ రావు, బాబు రావు, సత్యనారాయణ రావు, నాగేశ్వర్ రావు, రాజేశ్వర్ రావు, ప్రకాష్ రావు, రాజావీరు, రాజు, నర్సయ్య, రాజయ్య, రాచర్ల నరేష్, యాద కుమార్, కుక్కమూడి కిరణ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలకు నీటి మోటార్ అందజేత



**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ క్లబ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో రఘునాథపల్లి మండలం, మండేలగూడెం జడ్పీ పాఠశాలకు నీటి సౌకర్యం కోసం మోటారును అందించడం ఆనందంగా ఉందని లయన్ డిస్ట్రిక్ట్ 320 ఎఫ్ జీఐటీ కోఆర్డినేటర్ లయన్ కుర్రెముల యాదగిరి అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ఈ సబ్ మెర్సిబుల్ మోటార్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు లయన్స్ క్లబ్ ప్రయత్నిస్తుందని యాదగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రాజపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల చాలా కాలంగా నీటి సమస్యను ఎదుర్కొంటుందని తెలిపారు. నీటి సరఫరా కోసం ఉన్న ఏకైక మోటారు పనిచేయడం ఆగిపోయి విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. తాగునీరు, మరుగుదొడ్లకు, మధ్యాహ్న భోజనం వంట కోసం కూడా నీరు పొందడానికి ఇబ్బంది పడ్డారని ఆయన వివరించారు. విద్యార్థుల ఇబ్బందులను చూసి లయన్ నాయకుడు కుర్రెముల యాదగిరి ఉదార హృదయంతో ముందుకు వచ్చి, వ్యక్తిగతంగా రూ. 15,000 ఖర్చు చేసి కొత్త సబ్మెర్సిబుల్ మోటార్‌ను ఏర్పాటు చేశారని రాజపాల్ రెడ్డి ప్రశంసించారు. ఇప్పుడు పాఠశాలలో తాగునీరు, ఇతర అవసరాలకు సరైన నీటి సరఫరా సౌకర్యం ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లయన్స్ క్లబ్‌కు, కుర్రెముల యాదగిరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ 71వ వార్షికోత్సవం

◆ కార్మికుల హక్కులకై నిరంతర పోరాటం



**వరంగల్ వాయిస్, పరకాల :** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని 71వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పరకాల మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడగాని జనార్ధన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రావు మాట్లాడుతూ బీఎంఎస్ భారతదేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా నిలిచిందని కొనియాడారు. కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. 1955లో భూపాల్ (మధ్యప్రదేశ్) లో స్థాపించబడిన ఈ కార్మిక సంఘం, క్రమక్రమంగా భారతదేశంలో నంబర్ వన్ యూనియన్‌గా పేరు తెచ్చుకుందని తెలిపారు. కార్మికుల కోసం ఎన్నో త్యాగాలు చేసి, వారి హక్కులను కాపాడిందని, ఇంకా సాధించాల్సిన వాటి కోసం ముందంజలో ఉందని అన్నారు. కార్మికుడు నాయకుడిగా ఉండాలని, ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా కార్మికుల పక్షాన నిలబడి బీఎంఎస్ పోరాటాలు చేస్తుందని జనార్ధన్ రావు స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగాలతో పాటు అన్ని కార్మిక రంగాలలో బీఎంఎస్ పనిచేస్తుందని, ప్రపంచ దేశాలలో కూడా దీని ఆచరణను స్వీకరించారని వివరించారు. కార్మికులకు పనికి తగిన వేతనం, అసంఘటిత కార్మికులకు ఆరోగ్య భద్రత, వారానికి ఒక రోజు సెలవు దినం, లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు, వారి పిల్లలకు ఉచిత చదువులు కల్పించాలని ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కార్మికులను మర్చిపోతున్న ప్రభుత్వాలు, కార్మిక చట్టాలను కుదించడం ద్వారా కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలను కూల్చి, కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీఎంఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దర్జీ కార్మికులు ఎంఏ షరీఫ్, మేఘనాథ్, సాంబయ్య, దొంతుల జగన్, రమేష్, తిరుపతి తదితర కార్మికులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాలపై కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



**వరంగల్ వాయిస్, దామెర :** రాబోయే వారం రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున దామెర మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పిడుగుపాటు ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఉరుములు, మెరుపులు పిడుగుపాటుకు సంకేతాలని ప్రకాష్ రెడ్డి వివరించారు. చెట్ల కింద నిలబడటం, విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉండటం వంటివి పిడుగుపాటు ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. పిడుగులు పడే సమయంలో లోహపు వస్తువులను ఉపయోగించవద్దని, నీటిలో ఉండకూడదని సూచించారు. పిడుగుపాటు నుంచి రక్షణకు కొన్ని జాగ్రత్తలను ఆయన తెలిపారు. భూమిపై అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్లపై కూర్చోవడం, మోకాళ్లపై చేతులు తలపెట్టుకొని ముడుచుకొని కూర్చుంటే పిడుగు పడిన సమయంలో విద్యుత్ ప్రభావం తక్కువగా ఉంటుందని వెల్లడించారు. వర్షాల కారణంగా ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 86883 50465 కు సమాచారం అందించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి కోరారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

అధికారులకు ప్రణవ్ ఆదేశాలు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అధికారులను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, వర్షాకాలంలో ప్రబలే విష జ్వరాలపై ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని కూడా ప్రణవ్ సూచించారు. బుధవారం ఆయన 5 మండలాల ఎంపీడీవోలు, 2 పట్టణాల కమిషనర్లతో ఫోన్లో మాట్లాడి తగు సూచనలు చేశారు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్ళేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కరెంట్ స్తంభాలు, విద్యుత్ తీగలను సరి చూసుకోవాలని ప్రణవ్ కోరారు.

## అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని బూరుగుపేట మారేడుగొండ చెరువును పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో ముఖ్యంగా చెట్ల కింద, విద్యుత్ స్తంభాల కింద ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో ఏదైనా సమస్య తలెత్తితే రెవెన్యూ సిబ్బంది నంబర్లు 9618012140, 9989557547 కు సంప్రదించగలరని తహసీల్దార్ తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశామని, తమ సిబ్బంది నిత్యం గ్రామాల్లో పర్యటిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట ఆర్.ఐ. విజేందర్ తదితరులు ఉన్నారు.



# ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

## ◆ యూఎస్‌పీసీ డిమాండ్



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, మొదటి దశ పోరాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్, వరంగల్ మండలాల తాసిల్దార్లకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ జిల్లా నాయకులు ఊటుకూరి అశోక్, ఎ.గోవింద రావు, సుజన్ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలకు చేరువైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) ఇవ్వకుండా జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ నివేదికను వెలువరించి జూలై 2023 నుంచి వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలి. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి. 5571 ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులను ప్రకటించాలి. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి. జీవో నంబర్ 25ను సవరించాలి. ప్రతి ప్రైమరీ స్కూల్‌లో ఇద్దరు టీచర్లు, 40 మంది పిల్లలు దాటితే 5 మంది టీచర్లు ఉండేలా పాఠశాలలను బలోపేతం చేయాలి. పెండింగ్‌లో ఉన్న 5 డీఏ (డియర్‌నెస్ అలవెన్స్)లను వెంటనే ప్రకటించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల టైమ్ టేబుల్ మార్చాలి. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇవ్వాలి, బేసిక్ పే ప్రకటించాలి. మోడల్ స్కూల్ టీచర్లకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలి. కుల గణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు ఎన్. శ్రీనివాస్, మండల నాయకులు నరసింహారావు, ఎండీ. ముజాహిద్దీన్, జి.రాజేష్, వై.అశోక్, ఎ.హరి ప్రసాద్, టి.ఆనందాచారీ, డి.రవీందర్, ఎం.రాజ్ కుమార్, ఎండీ.సాలార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** దేశ స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని, వరంగల్ జిల్లాలోని కాశీబుగ్గ మండలం, ఎల్. బీ. నగర్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సముద్రాల పరమేశ్వర్, ఎరుకల రఘునరెడ్డి, బైరి మురళీ కృష్ణ, మార్టిన్ లూథర్, గోకే వెంకటేష్, నోముల రతన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ "స్వాతంత్ర్య సమరయోధులు దేశ భవిష్యత్తు కోసం చేసిన త్యాగాలను యువత గుర్తుంచుకోవాలి. వీరి జీవితాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మహనీయుల చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశభక్తి నినాదాలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని నింపాయి. కోమాకుల నాగరాజు, రాఘవాచారి, సతీష్, ప్రభాకర్, ప్రవీణ్, సత్యం, అల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## దామెరలో డీవైఎఫ్ఐ ర్యాలీ



**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వ విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం దామెర మండల కేంద్రంలోని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో తరగతులను బహిష్కరించి, బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని అనేక ఏళ్లుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు ఎడ్ల హర్షవర్ధన్, సంజయ్ రామ్, నాగ సాయికుమార్, నాగచైతన్య, సాయి సిద్ధార్థ్, మణికంఠ, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు గాను ఫీజు రీయింబర్స్‌మెంట్లు మరియు స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్న బకాయిలను గత ఆరేళ్లుగా ప్రభుత్వం చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని ఆయన అన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించనందున విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా విద్యార్థులు తమ తదుపరి చదువులను కొనసాగించడానికి అవకాశం లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు విద్యార్థుల అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని 18 నెలలు గడిచినా అమలుచేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యాసంస్థల బంద్ జయప్రదంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బకాయిలను విడుదల చేయడంతో పాటు, విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు వంటి డిమాండ్లను పరిష్కరించాలని వెంకట్రాములు కోరారు. లేనిచో విద్యార్థుల ఆందోళనలు ఉధృతమైతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు

# ఎమ్మెల్యేను కలిసిన కొత్తపల్లి గోరి ఎస్సై దివ్య



**వరంగల్ వాయిస్, కొత్తపల్లి గోరి :** నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సాకపురం దివ్య బుధవారం భూపాలపల్లి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపల్లి గోరి మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు..

# బీజేపీ బీసీ ద్రోహుల పార్టీ

## వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం కుదరదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఢిల్లీలో ప్రకటించడాన్ని బీసీలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని, బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే బీజేపీ బీసీల ద్రోహుల పార్టీగా చరిత్రలో నిలిచిపోతుందని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిగా ఉన్నప్పుడే ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర ఉందని, ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయిన తర్వాత తొలిసారి చేపట్టిన ఢిల్లీ పర్యటనలో సామాజిక రిజర్వేషన్లపై తనకున్న వ్యతిరేక భావాన్ని, బీసీ రిజర్వేషన్లపై లేనిపోని అబద్ధాలు చెబుతూ విషం వెళ్లగెక్కాడని వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు.48 గంటల్లోగా బీసీ రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కానీ, రామ్‌చందర్ రావు చేసినటువంటి వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

# ధర్మసాగర్ రిజర్వాయర్ నీళ్లు విడుదల

- రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే నాగరాజు భరోసా



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. స్థానిక స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్.నాగరాజు కొబ్బరికాయ కొట్టి నీళ్లను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల రైతుల పంట పొలాలకు నీరు అందించడం కోసం బుధవారం సౌత్ కెనాల్ గేట్లను ఎత్తి కాలువల ద్వారా నీటిని విడుదల చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, ప్రమాద బీమా, కౌలు రైతులకు రూ. 12 వేలు అందిస్తూ రైతు పక్షపాతిగా పనిచేస్తుందని నాగరాజు పేర్కొన్నారు. కొందరు నాయకులు రెండు, మూడు రోజుల్లో వర్షాలు వస్తున్నాయని తెలుసుకొని రాజకీయ లబ్ధి పొందడం కోసం "నీళ్లు రాకుంటే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం" అంటూ రైతులను మభ్యపెడుతూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, 'ఆన్ అండ్ ఆఫ్' పద్ధతిలో రైతులకు నీళ్లు వస్తాయని, వర్షాలు సమృద్ధిగా పడితే నిరంతరం నీళ్లు వస్తూనే ఉంటాయని రైతులకు విజ్ఞప్తి చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి అండగా నిలవాలని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, జులై 23, 2025

# ఆర్టీసీ పై నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం

◆ మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ప్రగతి బాటలో
◆ జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఆర్టీసీని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల నమ్మకాన్ని పెంచిందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధవారం జనగామ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలువుతున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఒక్క జనగామ డిపోలోనే 2.26 కోట్ల మంది మహిళలు ప్రయాణించడం ద్వారా ఆర్టీసీకి రూ. 108.96 కోట్లు ఆదాయం సమకూరిందని తెలిపారు. ఆర్టీసీకి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం అద్భుతమని, మహిళలు ఎక్కని బస్సు లేదన్నారు. బస్సుల ద్వారా ఆదాయం సమకూరడంతో మహిళా సంఘాలు బస్సులను కొనుగోలు చేసి, తద్వారా లబ్ధి పొందడమే కాక ఆ బస్సులకు యజమానులుగా మారారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్టీసీని ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు సాధికారత దిశగా కొనసాగడానికి ఇది ఒక తార్కాణంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ లాభాల బాటలో పయనించడం సంతోషకరమని, అందుకు మహాలక్ష్మి పథకమే కారణమని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, తమ వస్తువులను జాగ్రత్తపరుచుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రయాణికులకు మరింత భద్రత కల్పించాలని ఆయన ఆదేశించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఒకప్పుడు 36 వేల మంది ప్రయాణించే ఈ ప్రాంతం ఇప్పుడు 56 వేల మంది ప్రయాణికులతో, అందులో 66 శాతం మహిళలతోనే ప్రయాణాలు కొనసాగుతున్నాయని వివరించారు. 97 ఆర్టీసీ డిపోలకు సంబంధించిన 341 బస్ స్టేషన్లలో ఈ వేడుకలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థ ప్రగతి బాటలో పరుగులు పెడుతుందని, అందుకు ఆర్టీసీ ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఆర్థికంగా లబ్ధి పొందుతున్న మహిళా ఉద్యోగులు, మండల విద్యాశాఖ అధికారి కళావతి, ఉపాధ్యాయురాలు స్వరూప మాట్లాడుతూ, జనగామ ప్రాంతం జన సాంద్రత గల ప్రాంతమని, ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో విజయం సాధించిందన్నారు. ప్రతి నెలా ఆర్థిక భారం తగ్గడంతో కుటుంబాలు ఆనందంగా ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వలన సంస్థ ప్రగతి బాటలో దూసుకుపోతుండడంతో ఏర్పాటు చేసిన పోటీలలో పలువురు విద్యార్థులు పాల్గొని వ్యాసరచన పోటీలలో గెలుపొందగా, జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానించి ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పండేరి నితిన్ చేతన్, డీఆర్డీఓ అదనపు పీడీ నూరుద్దీన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ఉచిత మహిళా ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# జయహో ఆకాశవాణి

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** "ఆకాశవాణి వార్తలు చదువుతున్నది" అంటూ ప్రారంభమయ్యే జాతీయ, అంతర్జాతీయ రేడియో వార్తలు, అనేక వినోద కార్యక్రమాలు నేటితరం వారికి తెలియకపోవచ్చును కానీ, ఆనాటి తరం వారికి సుపరిచితం. ప్రసారాలు ప్రసారమయ్యే సమయానికి వారు రేడియోని యాదృచ్ఛికంగా ఆన్ చేసేవారు. వార్తలు, చర్చలు, కథానికలు, పాటలు, ప్రత్యేకించి శనివారం వచ్చిందంటే బాలల కోసం "బాలానందం" అనే కార్యక్రమం చిన్నారులు ఎంతో ఆసక్తిగా వినేవారు. నేటి ఆధునిక యుగంలో ప్రసార మాధ్యమాలైన టీవీలు, ఇంటర్నెట్, యూట్యూబ్ ప్రపంచాన్ని ఏలుతున్నా, నేటికీ రేడియో ప్రసారాలను ఆదరించే శ్రోతలు ఉన్నారంటే గొప్ప విషయమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. అప్పటి నుంచి జూలై నెల 23వ తేదీని "జాతీయ ప్రసార దినోత్సవం"గా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత ఆకాశవాణిగా నామకరణం చేసి నిరంతర ప్రసారాలతో ఎందరో శ్రోతల అభిమానాన్ని పొంది, ఆకాశవాణి అతిపెద్ద ప్రసార సంస్థగా గుర్తింపు పొందడం, ఆనాడు వివిధ విభాగాలలో పనిచేసిన ఎంతోమంది కృషి దీనికి కారణమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సాక్షాత్తు దేశ ప్రధాని సైతం "మన్ కీ బాత్" కార్యక్రమం కోసం రేడియో మాధ్యమాన్ని ఎన్నుకోవడం అభినందనీయమని నిమ్మల శ్రీనివాస్ అన్నారు. తాను కూడా 1975లో హైదరాబాద్ రేడియో స్టేషన్‌లో రికార్డు చేసిన "పరమానందయ్య శిష్యులు" నాటకం బాలానందం కార్యక్రమంలో ప్రసారం జరిగిందని ఆ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

## బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల వృత్తుల మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, బేషరతుగా బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీసీ జనాధికార సమితి – రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. "బట్టలు ఉతుకునే జాతి వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే అయ్యిండు, చేపలు పట్టుకునే శ్రీహరి మంత్రి అయ్యిండు" అంటూ కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన అగ్రకుల ఆధిపత్య అహంకారంతో మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకొని, బీసీ సమాజానికి, కులవృత్తులు చేస్తున్న ఉత్పత్తి కులాల సేవకుల సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం అని కుమార్ గాడ్గే అన్నారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా కులాహంకారంతో మాట్లాడుతున్న రెడ్డి దొరల పార్టీలను రేపు జరగబోయే స్థానిక ఎన్నికలలో ఓడగొట్టాలని రజక కుల బంధువులకు పిలుపునిచ్చారు.

# బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

## బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రవినాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని ఏకలవ్య, నాగార్జున విద్యా సంస్థలలో బీఆర్ఎస్వీ డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జి బండి దీపక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు జరిగే నష్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మానుకోట జిల్లా అధ్యక్షుడు గుగులోతు రవినాయక్ మాట్లాడుతూ.. చంద్రబాబు, రేవంత్ రెడ్డిల చీకటి ఒప్పందం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కేంద్రం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బనకచర్ల పేరుతో తెలంగాణ ప్రాంత నీటిని ఆంధ్రకు తరలించే కుట్రను, జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ సమాజానికి వివరించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టకపోతే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నగూడూరు మండల నాయకులు బాదావత్ సురేష్ నాయక్, గుగులోతు వెంకటేష్, భూక్య చంద్రశేఖర్, విద్యార్థి నాయకులు సుమన్, భరత్, రమేష్, వినయ్ పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో అంగన్‌వాడీ ఆయా మృతి

## ఆర్థిక సహాయం అందజేసిన సిబ్బంది



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్త్రీ శిశు సంక్షేమ శాఖ, డోర్నకల్ ప్రాజెక్టు పరిధిలోని సుభాష్ స్ట్రీట్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న మల్లికాంబ బుధవారం మృతి చెందారు. డోర్నకల్ సీడీపీఓ లక్ష్మి, సూపర్వైజర్ రేఖాభాయి, టీచర్లు ఆమె భౌతికకాయానికి పూలమాలలతో నివాళులర్పించి, కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో అంగన్‌వాడీలు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మల్లికాంబ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# ఘనంగా శ్రీరామ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, దామెర మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్ రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్కల దేవి రమేష్, వేల్పుల సుధాకర్ వాజ్‌పాయ్, సంతోష్ బాబు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు శ్రీరామ్ రెడ్డి ప్రజాసేవా చరిత్రను స్మరించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నడికూడ అభివృద్ధి కాంగ్రెస్ ఘనతే

● మాజీ ఎమ్మెల్యే చల్లా చేసింది శూన్యం
● కాంగ్రెస్ నేత మలహాల్ రావు



**వరంగల్ వాయిస్, నడికూడ :** గత పదేళ్లు అధికారంలో ఉన్న మాజీ శాసనసభ్యులు ధర్మారెడ్డి నడికూడ మండలంలోని గొల్లపల్లె బ్రిడ్జి, కంఠాత్మకూర్ బ్రిడ్జిలకు కనీసం ప్రొసీడింగ్‌లు కూడా తీసుకురాలేకపోయారని, మాజీ సర్పంచ్ ఊర రవీందర్ హయాంలో గోల్లేపల్లె బ్రిడ్జిని తీసుకొచ్చామని చెప్పడం బోగస్ మాటలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మలహాల్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, ప్రజా ప్రభుత్వంలో గౌరవ పరకాల నియోజకవర్గ శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి కొత్త ప్రొసీడింగ్‌లు తీసుకొచ్చి, బ్రిడ్జి అంచనాలకు మించి కోట్ల రూపాయల వ్యయంతో నడికూడ మండలంలోని రెండు బ్రిడ్జిల పనులను శరవేగంగా పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న ఘనత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, నడికూడ మండలం ఏర్పడిన తర్వాత కనీసం అంబులెన్స్ కూడా పెట్టలేని స్థితిలో గత బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని, కానీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నడికూడ మండలానికి తప్పనిసరిగా అంబులెన్స్ ఉండాలని చెప్పి, వారు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. దాదాపు రూ.45 లక్షలతో ఎంఈఓ భవనాన్ని పూర్తి చేసిన ఘనత కూడా ఎమ్మెల్యేకే దక్కుతుందని, త్వరలోనే ప్రారంభోత్సవం కూడా ఉంటుందని తెలిపారు. పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు రూ. 65 కోట్ల రూపాయలతో ఫోర్ లైన్ రహదారిని మంజూరు చేయించిన ఘనత కూడా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారికి దక్కుతుందని మలహాల్ రావు పేర్కొన్నారు. గత హయాంలో రోడ్డు వెడల్పులో కోల్పోతున్న లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని చెప్పి, వారి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి, వారికి ఎలాంటి ఇల్లు కట్టకుండా మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని గుర్తు చేశారు. త్వరలోనే నడికూడ మండలానికి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చి కావలసిన సదుపాయాలన్నీ కూడా కల్పిస్తారని తాము బలంగా నమ్ముతున్నామని అన్నారు. నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రజలందరికీ రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

# రేగొండలో పల్లె దవాఖాన ప్రారంభం

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, రేగొండ :** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పల్లెల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల కేంద్రంలో ఎన్ హెచ్ ఎం నిధులు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానా (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, దాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ పనిచేసే డాక్టర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. నియోజకవర్గంలోని పల్లెల్లో మరిన్ని దవాఖానాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీదేవి, హెల్త్ ఆఫీసర్ హిమబిందు, సూపర్వైజర్లు సుధ, వినోద లక్ష్మి, రాము, ఆశ కార్యకర్తలు స్వప్న, రజిత, సుభద్ర, హసీనా, జరీనా, పవిత్ర పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు సీతారాంపూర్ జలమయం

## అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**వరంగల్ వాయిస్, గణపురం :** ఒక్క గంట భారీ వర్షానికే సీతారాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లన్నీ జలమయమై, ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తుందని తెలిసినా సైడ్ కాలువల పూడికలు తీయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, కొందరు తమ ఇష్టానుసారం చిన్న చిన్న మోరీలు వేసి వరద నీరు సక్రమంగా పోకుండా అడ్డుకుంటున్నారని, గ్రామ పంచాయతీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. గత రెండేళ్లుగా సైడు కాలువల్లో పూడికలు తీసిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, నేతలు ఉన్నప్పటికీ, సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారని, "గల్లీకో లీడర్ వారి ఒంటిమీది బట్టలు తెల్లగా, ఊరు మాత్రం మురికిగా" తయారైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఎనలేని అభివృద్ధి ముచ్చట్లు చెబుతారని, కానీ ఆచరణలో "ఎక్కడ గొంగళి అక్కడే" అన్న చందంగా తయారైందని వాపోయారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అన్నారం దర్గా హుండీల లెక్కింపు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రముఖ యాత్రా స్థలం అన్నారం యాఖుబ్ శావాలి బాబా దర్గా హుండీలను మంగళవారం దర్గా లోపలి ఆవరణలో లెక్కించారు. ఈ క్రమంలో 4 నెలలకు సంబంధించిన హుండీలను లెక్కించగా రూ,1,002,600 సమకూరినట్లు వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ రియాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు వక్ఫ్ అధికారులు, దర్గా సిబ్బంది, పాల్గొన్నారు.

### దర్గా హుండీ ఆదాయంపై అనుమానం..

ప్రముఖ యాత్ర స్థలం అన్నారం షరీఫ్ దర్గాలో హుండీల ద్వారా సేకరించిన ఆదాయంపై అన్నారం గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాస్తవ మొత్తాన్ని తక్కువగా నివేదించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. వక్ఫ్ అధికారుల నిర్వహణ కాలాల్లో సేకరించిన ఆదాయంలో వ్యత్యాసం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 4 నెలల పాటు వక్ఫ్ అధికారుల నిర్వహణలో (ఎండాకాలం) దాదాపు రూ. 1 కోటి ఆదాయం అంచనా వేసినప్పటికీ, రూ. 10 లక్షల వద్ద వసూలు గణనీయంగా తక్కువగా ఉంది.

### అంచనా వర్సెస్ వాస్తవ ఆదాయం..

కాంట్రాక్టర్ సేకరణ రేటు ఆధారంగా, వక్ఫ్ బోర్డు నిర్వహణలో సంవత్సర కాలానికి అంచనా వేసిన ఆదాయం గణనీయంగా ఉండాలి. అయితే, వాస్తవ సేకరణ చాలా తక్కువగా ఉంది, ఆదాయాన్ని తక్కువగా నివేదించడం గురించి గ్రామస్తులలో అనుమానాలను రేకెత్తిస్తోంది. గ్రామస్తులు పారదర్శకతను కోరుతున్నారు. వక్ఫ్ బోర్డు నిర్వహణ సమయంలో తక్కువ ఆదాయం రావడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక నాయకులు ఆదాయాన్ని దుర్వినియోగం చేయడంలో పాలుపంచుకున్నారని అనుమానిస్తున్నారు. పారదర్శకత కొరకు దర్గా ఆదాయాన్ని ఆడిట్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## రేగొండ పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇంచార్జి డీఎంహెచ్ఓ శ్రీదేవితో కలిసి సందర్శించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సందర్శన సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ పలు సూచనలు చేశారు. ముందుగా కలెక్టర్ ఆసుపత్రిలో మౌలిక వసతులను పరిశీలించి, ఫార్మసీ, ల్యాబ్ గది, పేషెంట్ల బెడ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు అప్రమత్తంగా ఉండేలా, నివాస గృహాల వద్ద పరిశుభ్రత పాటించేలా ఎప్పటికప్పుడు ★★అవగాహన కల్పిస్తూ ఉండాలని, తద్వారా వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం అందజేసి ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడేలా పాటుపడే బాధ్యత తమపై ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఇంచార్జి డీఎంహెచ్ఓ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, ఫార్మసిస్ట్ సులోచన, సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ ఎరబాటి రామారావు, లింగారెడ్డి, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వేతన సమస్యలు పరిష్కరించాలి

## ఎంపీవోకు ఈ-పంచాయతీ ఆపరేటర్ల వినతి



**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో గత నాలుగు సంవత్సరాలుగా ఈ–పంచాయతీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు నెలసరి వేతనం రూ. 22,750గా స్థిరంగా లభిస్తుండగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించే క్రమంలో రూ. 19,500 మాత్రమే చెల్లించిందని దామెర మండల ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు దాసి రాజు, గుంటి శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దామెర ఎంపీవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. పెండింగ్ వేతనాలు, అరియర్స్ చెల్లింపు డిమాండ్: వేతన సవరణ జరిపి తమ వేతనాన్ని రూ. 22,750గా కొనసాగించాలని, ఏప్రిల్, మే, జూన్–2025 పెండింగ్ వేతనాలతో పాటు నవంబర్ నుండి ప్రతి నెలా రూ. 3,250 తక్కువగా వచ్చిన అరియర్స్‌ను కూడా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా గ్రీన్ ఛానల్ ద్వారా నెలసరి వేతనం రూ. 22,750 చెల్లింపులు జరిగేలా, అలాగే ఉద్యోగ భద్రత కల్పించుటకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# పాలిటెక్నిక్ డిప్లొమా ప్రవేశాల తుది విడత వెబ్ కౌన్సిలింగ్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాంకేతిక విద్యా శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, TGPOLYCET–2025 డిప్లొమా కోర్సుల తుది విడత వెబ్ కౌన్సిలింగ్ గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా హెల్ప్‌లైన్ సెంటర్లలో ప్రారంభమవుతోంది. పాలిటెక్నిక్ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలలో ప్రవేశాల కోసం అభ్యర్థులు ఈ తుది విడతలో పాల్గొనడానికి సన్నద్ధమవ్వాలి. ఈ కౌన్సిలింగ్‌లో మొదటి విడతలో సీటు పొందిన అభ్యర్థులు సైతం బెటర్‌మెంట్ కోసం తిరిగి ఆప్షన్లు ఇవ్వవచ్చు. అలాగే, మొదటి విడతలో సీటు పొందని అభ్యర్థులు కూడా ఈ తుది విడతలో అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అయితే, మొదటి విడతలో కౌన్సిలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు, తుది విడతకు కొత్తగా స్లాట్ బుక్ చేసుకుని ధృవపత్రాల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా TG POLYCET హెల్ప్‌లైన్ సెంటర్‌గా గుర్తింపు పొందిన ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ కేంద్రంలో ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులు సకాలంలో అవసరమైన ధృవపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా. బైరిప్రభాకర్ సూచించారు.

# రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి

## ● జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. బుధవారం వెంకటాపురం మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ★★అన్ని రికార్డులను, రిజిస్టర్లను, గదులను, ఇన్‌వార్డు రోగి వార్డులను పరిశీలించారు. డాక్టర్ల సేవలు ఏ విధంగా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు, వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు బాగున్నాయని రోగులు తెలియజేయగా, కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ గదిని పరిశీలించి, ★★మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ పరీక్షలు జ్వరంతో వచ్చే ప్రతి రోగికి చేయాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ఇతర సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివాజీ, హెడ్ నర్స్ సరస్వతి, ల్యాబ్ టెక్నీషియన్ గురుదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# షెడ్యూల్ ప్రకారమే మిరాయ్ విడుదల




హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నాడు యువ నటుడు తేజసజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న మరో పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఢల్లీ భామ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. సినిమా కోసం ఎదురుచూస్తున్న వారి కోసం మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ వైబ్ ఉంది అప్‌డేట్ అందించారు. వైబ్ ఉంది అంటూ సాగే మెలోడీ ట్రాక్‌ను జులై 26న తెలుగుతోపాటు- పలు ప్రధాన భాషల్లో విడుదల చేయనున్నట్టు- ప్రకటించారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తేజ సజ్జా, రితికా నాయక్ రొమాంటిక్ ఫోజులో ఉండటం చూడొచ్చు. మిరాయి అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2025 సెప్టెంబర్ 5న పలు భాషల్లో విడుదల కానున్నట్టు- ప్రకటించి సినిమా వాయిదా పుకార్లకు చెక్ పెట్టారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ-జీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తుండగా.. గౌరా హరి సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుందని ఇప్పటికే వార్తలు రాగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ- రావాల్సి ఉంది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన మిరాయి టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది.



# రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు..

## నిత్యామీనన్

బాష తో సంబంధం లేకుండా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి నిత్యా మేనన్,. ఇప్పుడు 'సార్ మేడమ్' చిత్రంతో మళ్లీ అభిమానుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా జూలై 25న విడుదల కాబోతున్న సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్య, ప్రేమ, సంబంధాల గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నిత్య మాట్లాడుతూ.. 'ఒకప్పటి నా ఆలోచనలతో పోలిస్తే, ఇప్పుడు ప్రేమకు నా జీవితంలో అంత ప్రాధాన్యం లేదు. ప్రేమకు, సోల్‌మేట్‌కు మనం అవసరమని, లేకపోతే జీవితం అసంపూర్ణమని అనుకునే రోజులు నాకు కూడా వచ్చాయి. అలాంటి వ్యక్తిని వెతికిన అనుభవం కూడా ఉంది. కానీ.. కాలక్రమేణా అర్థమైంది.. మన జీవితం ఒక్క వ్యక్తి మీద ఆధారపడి ఉండాల్సిన అవసరం లేదని. ఒక్కరే ఉండటం ఒక లోపం కాదు. రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా! జీవితంలో పెళ్లి జరగకపోయినా మరేదేం ఉండదు. కొన్నిసార్లు తోడు లేదు అనే బాధ కలుగుతుంది, కానీ నేను ఈ స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నాను. జీవితంలో అనుభవించిన పాఠాల వల్లే నేను ఈ స్థితిలో ఉన్నాను. ఏదైనా జరిగిన అది మన మంచికే అనుకోవడం నేర్చుకున్నాను' అని అన్నారు. నిత్య మాటలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# హాట్‌కేకుల్లా హరిహర వీరమల్లు టిక్కెట్లు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన పిరియాడికల్ యాక్షన్ చిత్రం హరిహర వీరమల్లు మరికొన్ని గంటల్లో థియేటర్స్ లో అడుగుపెడుతోంది. ఈ సినిమా అడ్వాన్స్ సేల్స్‌లో దూసుకెళ్తోంది.. నైజాం ఏరియాలో నేటి నుండి అన్ని షోస్ కు అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హౌస్ ఫుల్స్ తో దూసుకెళ్తోంది. ఇక ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో రాత్రి 9.30 గంటలకు ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఏపీలో ఇప్పటికి బుకింగ్స్ ఓపెన్ చేయగా సోల్డ్ అవుట్ అయ్యాయి. కానీ నైజాం లో పంపిణీదారులకు, ఎగ్జిబిటర్స్ కు మధ్య చిన్న తకరారు నడుస్తోంది. దాంతో ప్రీమియర్స్ బుకింగ్స్ ఓపెన్ చేయలేదు. అయితే ఇప్పుడు ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడిరది. హైదరాబాద్ లోని సింగిల్ స్క్రీన్స్‌కు సంబందించి బుకింగ్స్ ఓపెన్ చేసారు. కానీ ఇలా ఓపెన్ చేయడం అలా నిమిషాలలోనే టికెట్స్ బుక్ అవడం జరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే పవర్ స్టార్ సినిమా అందరి కంటే ముందే చూసేయాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టికెట్స్ హాట్ కేకుల్లా బుక్ అవుతున్నాయి. ఇప్పటివరకు కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ లోనే వరల్డ్ వైడ్ గా రూ. 29.5 కోట్లు– రాబట్టింది. ఇందులో కేవలం పాన్ ఇండియా వారీగా 4,388 షోస్ కు గాను రూ. 18.11 కోట్లతో 40.04శాతం ఆక్యుపెన్సీ రాబట్టింది.

# 20 ఏళ్ల కెరీర్‌లో ఎంతో నేర్చుకున్నా..

## రెజీనా

సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రెజీనా. ఆమె పరిశ్రమకు వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. 20 ఏళ్ల కెరీర్‌ను మైలురాయిగా ఎందుకు చూస్తారో అర్థమైందన్నారు. కానీ, తాను కొన్ని విషయాల్లో అగ్రస్థానంలో లేనన్నారు. కొన్నేళ్లుగా వరుసగా తెరపై కనిపించనప్పటికీ 20 ఏళ్లంటే చాలా పెద్ద విషయమని చెప్పారు. గతంలో ఓమారు సంవత్సరంలో నాకు పని చేయాలనిపించలేదు. యాక్టింగ్ మానేయాలనుకున్నాను. అంగీకరించిన ప్రాజెక్ట్‌లు పూర్తి చేశాను. 2018 నుంచి అవకాశాలు వరుస పెట్టాయి. ఒకేతరహా పాత్రల్లో నటించకూడదని నిర్ణయించుకున్నాను. టాలీవుడ్‌లోకి వెళ్లిన తొలినాళ్లలో ఉదయం 6 గంటలకే నాకు డైలాగులు తెచ్చి ఇచ్చేవారు. అప్పుడు నాకు తెలుగు రాదు. దీంతో ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అన్ని డైలాగులు కంఠస్థం చేశాను. భావోద్వేగాలను అర్థం చేసుకున్నాను. లైన్ టూ లైన్ నేర్చుకోవడం ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు తెలుగు బాగా మాట్లాడగలను. నాకు సినీ నేపథ్యం లేదు. ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు నటించి, ఇంటికి వచ్చేయడమే అని భావించాను. కానీ, కాలం గడిచేకొద్దీ పీఆర్‌లు, సోషల్ మీడియా ప్రాధాన్యం గురించి అర్థమైంది. నేను వీటికి చాలా రోజులు దూరంగా ఉన్నాను. నా నటనను చూసి అవకాశం ఇవ్వాలి కానీ, పబ్లిసిటీ చూసి కాదని అనుకున్నాను. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారానే నా పనిని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తున్నాను' అని చెప్పారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జూలై 23, 2025




# ఉచిత బస్ ప్రయాణంతో సంపూర్ణ ఆరోగ్యం

- **ఆలయాలకు పెరిగిన ఆదాయం**
- **అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఆలయాల ఆదాయం పెరగడంతో పాటు మహిళల ఆరోగ్యాలు కూడా మరింత మెరుగుపడ్డాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ అధ్యక్షతన వరంగల్ బస్టాండ్ లో బుధవారం మహాలక్ష్మి పథక సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించడం ద్వారా రూ.6,680 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఉచిత ప్రయాణం మహిలలకు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. మహిళలు ఆలయాలకు వెళ్లడం ద్వారా రూ.176 కోట్ల ఆదాయం పెరిగిందన్నారు. మహిళలు ఆరోగ్య విషయంలోనూ శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఏదైనా జబ్బు చేయగానే మారుమూల ప్రాంతాల నుంచి కూడా బస్సుల్లో ప్రయాణించి వరంగల్ ఎంజీఎం, ఇతర ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుని చేసే కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సమాఖ్యలకు బస్సులు అందజేసి ఆర్టీసీ ద్వారా ఆదాయం సమకూర్చుకునేలా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. వరంగల్ పట్టణ సమాఖ్యలకు కూడా బస్సులు అందించేలా ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాల ప్రవేశపెట్టి ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కె.బాను కిరణ్, మెకానిక్ సూపర్వైజర్ వి.చంద్రశేఖర్, వీవీఎన్ పాపారావు, వరంగల్ ఎస్ఎం గౌస్ మోహినుద్దీన్, ఏడీసీలు కేఎస్ రావు, కేవీ రెడ్డి, ఎండి మహమ్మద్ అలీ, కె.రాజు, జీఆర్. చందర్, ఈడబ్ల్యూబి సభ్యులు జి.సుందరయ్య, కె భిక్షపతి, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్సుల్లో ప్రయాణించిన వివిధ విభాగాలకు చెందిన మహిళా ప్రయాణికులకు సన్మానం చేశారు. అంతేకాకుండా రంగోలి, వ్యాసరచన పోటీల్లో పాల్గొని వజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.



# జీవనశైలిలో మార్పులు.. మానసిక వికాసానికి అడుగులు

## ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రాజ్ కుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రతి మనిషి జీవన శైలిలో మార్పులు, ప్రశాంతతతోనే మానసిక వికాసం లభిస్తోందని ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ వైద్యులు డాక్టర్ కుర్న రాజ్ కుమార్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 25 కోట్ల పైచిలుకు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, శరీరక సమస్యలకు అనుగుణంగా మానసిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. నేడు మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడం, మానసిక వ్యాధులతో ఉండేవాళ్లని చిన్న చూపు చేసి చూడడం జరుగుతోందన్నారు. వీటన్నిటికీ ప్రధానం ఒత్తిడి, డిప్రెషన్, మానసిక వ్యాకులత, నిద్రలేమి, బుద్ధిమాంద్యం గల పిల్లల్లో మనస్తత్వ మార్పు, మద్యం దుమపానానికి అలవాటు పడటం ఇలా పలు కారణాలున్నాయన్నారు. మానసిక సమస్యలు మొదట్లోనే గుర్తించి వైద్య నిపుణుల సలహాలు, సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడడంతోపాటు జీవన శైలిలో మార్పులు, సామాజిక మరియు కటుంబం యొక్క అండ తోడుంటే అట్టి వ్యక్తి మానసిక వికాసానికి గుర్తుగా నిలుస్తాడని రాజ్ కుమార్ తెలిపారు.



# ఘనంగా మైసమ్మ బోనాలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని డీకే నగర్ ప్రాంతం మైసమ్మ బోనాలు, శివసత్తుల పూనకాలు, డప్పుసప్పులతో మారుమోగింది. ఆషాడ మాసం చివరి రోజైన బుధవారం మహిళలు ఎంతో నిష్టతో తయారు చేసిన నైవేద్యంను బొనంలో తీసుకొని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా తరలివచ్చి మైసమ్మ తల్లికి సమర్పించారు. గొర్రెలు, కోళ్లను బలి ఇచ్చారు. ఇట్టి బోనాల ఊరేగింపునకు ముఖ్య అతిథిగా 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరై మైసమ్మ తల్లిని దర్శించి వర్షాలు కురవాలని, పాడిపంటలు అభివృద్ధి చెందాలని, డివిజన్ ప్రజలందరూ సుఖసంతోశాలతో ఉండేందుకు మైసమ్మ తల్లి అనుగ్రహం కావాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో డీకే నగర్ నాయకులు కుండె రాజు, కుండే కుమార్, మరుపల్ల గౌతమ్, తౌటం నరసింహ, పిట్టల సాంబరాజు, లక్ష్మీనారాయణ, రావుల సాయినాథ్, కొలిపాక మల్లయ్య, తవుటం విశాల్, తోట దినేష్, పిట్టల సమ్మక్క, మంద పవన్, పిట్టల హరికృష్ణ, దేవులపల్లి సర్వేశంలతోపాటు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

# కేఎంసీకి పార్థివ దేహం అప్పగింత

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోచమ్మ మైదాన్ నివాసి అడ్డగుడి తేజో మూర్తి అనారోగ్యంతో మరణించగా, ఆయన కుమార్తెలు వాసవి, జహ్నవి సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం శరీర దానం చేసేందుకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) అనాటమీ విభాగానికి అప్పగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, అనాటమీ విభాగాధిపతి మొహిద్దీన్ ఖాన్ ఆదేశంతో సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ దేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ అందరూ శరీర దానంపై అవగాహన కలిగిఉండి, మరణానంతరం శరీర దానం చేస్తే భవిష్యత్ వైద్యులకు ఉపయోగకారిగా ఉంటుందన్నారు. శరీర దానం చేసిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శరీర దాన సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాలకు 8790548706, 9490133650 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజేంద్రప్రసాద్, కోశాధికారి నరసింహ రాములు, ముఖ్య సలహాదారులు విశ్రాంత కమిషనర్ కె.భారతి, విజయ కుమారి పాల్గొన్నారు.



# పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు

- **పార్లమెంట్ లో వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**
- **డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** 2025లో సవరించిన శక్తి విధానం ఆధారంగా పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు మంజూరు చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలకు స్థిరమైన బొగ్గు సరఫరా లభించడంతో పాటు పోటీతత్వ ధరల ద్వారా వ్యాపార వ్యయాలు తగ్గుతుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో బొగ్గు ఉత్పత్తులపై కేంద్రం విధానాన్ని లోక్‌సభలో డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. దీనికి కిషన్ రెడ్డి సమాధానం చెప్పారు. సింగరేణి బొగ్గు విక్రయ విధానాలను వివరించారు. శక్తి విధానం 2017, 2025లో నవీకరణ, నాన్–రెగ్యులేటెడ్ సెక్టార్ లింకేజ్ వేలం విధానం 2016, 2020లో మార్పు, న్యూ కోల్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ 2007, 2022 వరకు సవరింపు, బ్రిడ్జ్ లింకేజ్ పాలసీ 2016 వంటి కేంద్ర బొగ్గు శాఖ విధానాల ప్రకారం సింగరేణి బొగ్గు గనుల కంపెనీ లిమిటెడ్ తన బొగ్గు సరఫరాను నిర్వర్తిస్తోందని మంత్రి వివరించారు. ఈ విధానాల అమలుతో పారదర్శకత, సమాన అవకాశాలు, పరిశ్రమలకు మద్దతు, ఉపాధి అవకాశాల పెరుగుదల, అలాగే రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్రానికి భారీ ఆదాయం లభిస్తోందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com